కథ

# ఏది అపచారం?

-కాకాని కమల

ఇంకా మధ్యాహ్నం పన్నెండున్నర కాలేదు. జేగంట మోగలేదు. కాళికాదేవి ఆలయంలో అమ్మవారి నివేదనకి ఆయత్తం అవుతున్నారు అర్చకులు.

పన్నెండింటిదాకా అమ్మవారికి కుంకుమార్చనలు, అష్టోత్తర, శతనామావళిలు, ఖడ్గమాల వగైరా పూజలు చేయించుకున్న భక్తులు ఆలయంలో బారులు తీరి వేచి ఉన్నారు.

కాళికా అమ్మవారిది అతి పురాతన దేవాలయం. గొప్ప మహత్తుగల ఆలయం. ముడుపులు కట్టేవారు, మొక్కులు చెల్లించుకునేవారు, తడిబట్టలతో గుడి చుట్టూ పొర్లేవారు. లక్షవత్తుల నోము, లక్ష కుంకుమార్చనలు చేసి పసుపు కుంకుమ పంచి పెట్టుకునే సువాసినులతో నిత్య కల్యాణం పచ్చతోరణంగా వుంటుంది ఆలయం.

ఇక పండగ దినాలు పర్వదినాల్లో ఆ సందడి చెప్ప నక్కరలేదు. పైగా ఈ రోజు శ్రావణ శుక్రవారం.

కాళికాదేవి ఆలయం వైకుంఠాన్ని మరపిస్తూంది. ఉదయం ఆరింటినుంచి పన్నెండింటిదాకా అర్చనలు జరిగాయి. పన్నెండున్నరకి మహానివేదన చేసి ప్రసాదం పెట్టి గుడి తలుపులు రెండింటి కల్లా మూసేస్తారు.

మళ్లీ సాయంత్రం నాలుగింటికి తెరుస్తారు. ఇప్పుడు సమయం పన్నెండుం పావు అవుతూంది. గర్భగుడికి ఎదురుగా ఉన్న మంటపంలో ఆస్థాన విద్వాంసులు కూర్చుని నాదస్వరం వాయిస్తున్నారు.

హృద్యమైన ఆ వాయిద్యంలో 'హిమ గిరి తనయే హేమలతే అంబ ఈశ్వరి శ్రీలలితే' అన్న కీర్తన శుద్ధ ధన్యాసి రాగంతో హృదయ రంజకంగా వినిపిస్తుంది. ఆలయం వెనుక వున్న చిన్న కటకటాల వంట శాలలో అమ్మవారి మహా నివేదనకి భోగం సిద్ధం అయ్యింది.

పెద్ద స్టీలు గంగాళాలనిండా పులిహార, దద్ధోజనం, చక్కెర పొంగలి వేడిగా పొగలు కక్కుతున్నాయి.

వాటి మీద శుభ్రమైన అరిటాకులు మూత పెట్టారు. ఆ బాధ్యత అంతా సుబ్బమ్మగారు, పిచ్చయ్య గారలదే. పేద దంపతులు.

చాలా రోజులు అక్కడా ఇక్కడా పెళ్ళిళ్ళకి వంటలు చేసుకుని బతికారు.

చివరికి ఎలాగో కాళికాదేవి గుళ్ళో ప్రసాదం చేసే ఉద్యోగం దొరికింది. నెలకి ఐదువందల జీతం, నిత్యం ఇంత ప్రసాదం దొరుకుతుంది. ఉండటానికి గుడి మెట్ల కింద వున్న రెండు గదుల చిన్న రేకుల పోర్షన్ ఇచ్చారు.

భోగానికి మహా ప్రసాదం సిద్ధం చేసి ఒంటినుంచి జారుతున్న చెమట ధారల్ని భుజం మీది తుండుగుడ్డతో తుడుచుకుంటూ "ఇదిగో నేనలా బావి దగ్గరకి వెళ్ళి వస్తాను" అని సుబ్బమ్మగారికి చెప్పి గుడి వెనక్కి వచ్చాడు పిచ్చయ్య.

బావిలో చేద వేసి బొక్కెన్లతో నీళ్ళెత్తి, చల్లగా తలమీద పోసుకోసాగాడు.

ఉదయం ఎనిమిదింటికి కూర్చుంటే ప్రసాదాలు పూర్తి అయ్యేసరికి ఆటైము అయ్యింది.

అంతసేపు గాడిపొయ్యిదగ్గరే.

మగడు అలా వెళ్ళగానే అయ్యగారు వచ్చి తీసుకెళ్ళటానికి అందుబాటుగా గడప పక్కగా గంగాళాలు పెట్టి అరిటాకులు కప్పింది సుబ్బమ్మ ఆపైన పెద్ద స్టీలు తాంబుళాలు మూత పెట్టింది.

ఆ కటకటాల తలుపుల్లోంచి ఘుమఘుమ లాడిపోతూ నోరూరించేస్తున్నాయి ప్రసాదాలు.

బొక్కెనతో నీళ్ళు తీసుకుని గాడి పొయ్యిలో కట్టెలు బయటికి లాగి బొగ్గులు చల్లార్చుతూంది సుబ్బమ్మ

అంతలో గంగాళాల దగ్గర 'ధణేల్' మని శబ్దం అయ్యింది. సుబ్బమ్మగారు ఉలిక్కిపడుతూ 'ఎవరది అయ్యవార్లా" అంటు గభాల్న తల తిప్పింది.

అప్పటికే ఏటవాలుగా ఉన్న కటకటాల తలుపులు ఘణఘణ కొట్టుకుంటున్నాయ్.

యానాది ఎంకటి గాడి కొడుకు ఆరేళ్ళ ఈరిగాడు ఒంటికున్న మురికి చొక్కానిండా పులిహార నింపుకుని మూట కట్టినట్టు ఎడం చేత్తో బిగించి పట్టుకుని కుడి చేత్తో నేతితో జీడిపలుకులతో ఘుమఘుమ లాడే చక్కెర పొంగలిని నోటినిండా కుక్కుకుంటున్నాడు.

అంతే.

ఆదృశ్యం చూస్తూనే సుబ్బమ్మగారి గుండె పగిలింది.

'అయ్యయ్యో... ఎంత అపచారం ఎంత అపచారం! ఆరి భ్రష్టపు వెధవా' అంటూ గభాల్న గాడి పొయ్యి ముందు నుంచి లేచి అందుబాటులో వున్న కట్టెని ఈరిగాడి మీదకి విసిరి ఒక్క పరుగున కటకటాల దగ్గరకి వచ్చింది సుబ్బమ్మ. ఒక్కఘడియ ఆలీసెం అయితే ఆ మండుతున్న కట్టె ఈరిగాడి మాడు పగల కొట్టేదే.

కాని వాడు మెరుపులా తప్పించుకుని ఒక్క ఉదుటన లేడిలా బయటికి పరిగెత్తాడు.

కిందపడ్డ కట్టెని అందుకుంటూ సుబ్బమ్మగారు "ఓరి అప్రాచ్యపు వెధవా! నీకిదేం పొయ్యే కాలంరా ఆగరా...." అంటూ వాడి వెంట పరిగెత్తింది.

"ఏవండోయ్... ఆ పుండా కోరు వెధవని పట్టుకోండి... ప్రసాదం మైల చేశాడు' అంటూ బావి దగ్గర స్నానం చేస్తున్న భర్తని పిలుస్తూ కేకలు పెట్టింది.

'ఒరే సత్తిగా... రావిగా... రండిరా.... ఆ వెధవని పట్టుకోండి.' అంటూ వెర్రి కేకలు పెడుతూ కాలుతున్న కట్టె పేడు పట్టుకుని వాడి వెంబడి పరిగెత్త సాగింది.

ఆరేళ్ళ వీరిగాడు ఆ కేకలకి అదిరిపోయాడు.

వేగంగా పరిగెత్తటంలో భయంతో కాలు త్రుళ్ళి ధబ్బున బొర్లా కిందపడ్డాడు.

చొక్కాలో మూట కట్టిన పులిహారంతా గుడి వెనక చత్రాతి మీద 'బలి' అన్నం చల్లినట్లు చిమ్ముకు పోయింది.

నోటినిండా చేతినిండా వున్న నేతి చక్కెర పొంగలి జారి అల్లంత దూరాన ముద్దలా నేలని కరుచుకు పోయింది. పెళ్ళాం కేకలు, ఈరిగాడి పరుగు చూసిన పిచ్చయ్యగారు కూడా నీళ్ళ బొక్కెన భళ్ళున ఒదిలి తడిపంచెతో 'ఆరి వెధవా... ఆగు.." అంటూ కేకలు పెడుతూ వాడ్ని వెంబడించడంతో ఆ గోలకి బిలబిల్లాడుతూ గుడి కాపలాదారు, రామిగాడు సత్తెయ్య చేతిలో కర్రలతో పరిగెత్తి గుడి వెనక్కి వచ్చారు.

లోపల అమ్మవారికి అర్చన జరుగుతూంది. తెర కట్టారు.

ఇవతల బారులు తీరిన భక్తుల్లోంచి కూడా ఆ కేకలకి బిలబలా బయటికి వచ్చారు జనం.

క్షణంలో గుడి వెనక జనం... గుళ్లో జనం అంతా గుడి వెనక పోగయ్యారు.

ఛట్టున కింద బొర్లాపడ్డ ఈరిగాడు సర్దుకుని లేవక ముందే వాడి చుట్టు జనం దడి కట్టారు.

సుబ్బమ్మగారు మహంకాళిలా మండి పడుతూ చేతిలో కట్టెతో ఛెళ్ళున ఈరిగాడి వీపుమీద ఒక్కటేసింది. పూనకం వచ్చి ఊగుతున్న దానిలా మళ్లీ కట్టె ఎత్తి ఆగకుండా వాడి వీపు మీద, మోకాళ్ళ మీదా ఫెడి ఫెడి మని తామసంగా వాయించింది.

'పుండా కోరు వెధవ. అమ్మవారి భోగం కోసం సిద్ధం చేసిన ప్రసాదం ముట్టుకుని ఎంగిలి చేస్తావా? కళ్ళు పోతాయిరా... ముదనష్టపోడా?' ఉగ్రంగా అలా వాడ్ని ఎడాపెడా వాయిస్తూనే ఉంది. గావు కేకలు పెడుతూనే ఉంది.

ఆవిడ ముఖం మీదంతా చెమట కమ్మింది. అంతవరకు గాడిపొయ్యి దగ్గర వుండేమో నుదుట పెట్టుకున్న పెద్ద కుంకుమ బొట్టు చెమటకి తడిసి ముకానమీంచి జారిపోతోంది. కళ్ళ కాటుక చెమటకి చీకిరి బీకిరిగా కళ్ళ చుట్టు అలుముకుంది. వేసుకున్న తడి జుట్టు ముడి జారిపోయి భుజాల నిండా పరుచుకుంది.

దుర్గ అమ్మవారి చేతిలోని త్రిశూలం మహిషాసురుడ్ని వధించినట్టు ఆవిడ చేతిలోని పొయ్యిలో కట్టె ఆరేళ్ళ ఈరిగాడ్ని ఏడా పెడా వాయిస్తోంది.

'అంతవరకు వామ్మో... బాబూ... చచ్చాన్రా నాయనా' అంటూ కేకలు పెట్టిన ఈరిగాడు ధబ్బున నేల మీద ఒరిగిపోయాడు.

వాడినోట్లోంచి కేకలు ఆగిపోయాయి.

'ఆగవే. ఆ కట్టె అవతల పారెయ్యి. ఆ వెధవ చచ్చాడో ఏవిటో...' పిచ్చయ్య గారు పెళ్ళాన్ని అదిలిస్తూ ఆవిడ చేతిలోని కట్టెని గుంజుకుని పక్కకి గిరాటేశాడు.

"అమ్మవారి భోగానికి సిద్ధం చేసిన ప్రసాదాన్ని అంటరాని కుర్రాడు మైల చేశాడు, ఎంగిలి చేశాడు."

క్షణంలో ఈ వార్త గుడి అంతా మారు మ్రోగిపోయింది. సన్నాయి మేళం ఆగిపోయింది.

గర్భగుడిలోని అయ్యగార్లు ఆగ్రహోదగ్రులవుతూ అఘమేఘాల మీద తెరతీసి ఇవతలకి వచ్చారు.

చేతిలో జేగంట పట్టుకుని 'ఠంగ్... ఠంగ్... ఠంగ్'' అని మ్రోగిస్తున్న రావుడు గంట పక్కన పెట్టి ఆ గోలకి పరిగెడుతూ గుడి వెనక్కి వచ్చాడు.

విషయం విన్న అందరి ముఖాలు జేవురించాయి. ఛెళ్ళు ఛెళ్ళున అంతాలెంప లేసుకోటం మొదలు పెట్టారు 'ఎంత అపచారం? ఎంత అపచారం? ప్రసాదం ఎంగలి చేశాడు కళ్ళుపోవూ?' ఆరు నెల్ల క్రితం వచ్చిన వరద ముంపులో ఈరిగాడి తల్లితండ్రీ యానాది ఎంకటి యానాది రత్తి కొట్టుకు పోయారు.

ఆ సమయంలో ఈరిగాడు లోతట్టున వున్న తమ గుడిసెలో లేడు. కొండ మీదికి ఆవుల్ని తోలుకెళ్లే గొల్లపిల్లగాళ్ళతో ఆటకెళ్ళాడు.

దాంతో ముంపులో చిక్కుకోలేదు.

బతికాడు.

కాని ఏం బతుకు?

తల్లితండ్రి లేని అనాథ బ్రతుకు.

అయిన వాళ్ళెవరూ ఆదరించలేదు.

రోడ్ల మీద తిరుగుతూ అడుక్కుంటాడు. దొరికిన్నాడు తింటాడు. లేని నాడు లేదు.

'అయితే మాత్రం? ప్రసాదం దొంగతనంగా తింటాడా? మడి వంట మైల చేస్తాడా? అమ్మవారి నివేదనకి సిద్ధం చేసిన భోగాన్ని ఎంగిలి చేస్తాడా? అలాంటి దొంగ వెధవల్ని నరికినా పాపం లేదు. ఇలాంటి తప్పుడు పన్లు చేస్తే కళ్ళుపోవూ?'

'ఇలాంటి పుండాకోరు వెధవ గనకనే వాడి బతుకు అలాగయ్యింది చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంతని క్రితం జన్మలో ఇలాంటి వెధవపన్లు ఇంకెన్ని చేశాడో?'

'అందుకే ఈ జన్మలో అనాథగా రోడ్డు పాలు అయ్యాడు.'

'కాస్సేపాగి అందరితోపాటు అయ్యగారే పెట్టేవారుగా ప్రసాదం? అసలు వెధవని గుళ్ళోకి ఎవరు రానిచ్చారు? మా రోజుల్లో ఇలా కాదమ్మా, అలగా జనాన్ని గుడికి ఆమడ దూరంలో వుంచేవాళ్ళం. ఇప్పుడు కాలం ఆచారం ఏడిస్తేగా అందుకే ఇలాంటి అపచారాలు, అమ్మవారికి శ్రావణ శుక్రవారం పూట అపచారం జరిగిపోయింది. ఎంతో ఆగ్రహిస్తుందో, ఏమో ఆ తల్లి? ఏం అరిష్టం రానుందో.' ఫెళ ఫెళా లెంపలేసుకుంటున్నారు.

చుట్టు మూగిన జనం తలా ఒక మాట విసురుతున్నారు. యానాది ఈరిగాడ్ని శాపనార్థాలు పెడుతున్నారు. "ఆ ముంపులో తల్లి తండ్రితో పాటు వీడు మునిగి పోయినా పీడా పోయేది." అని మెటికలు విరుస్తున్నారు.

కాని కింద పడ్డ ఆరేళ్ళ ఈరిగాడు మాత్రం 'ఆ' అనటం లేదు. 'ఊ' అనటం లేదు.

ఏడుపు ఆగి చాలా సేపయింది.

'వామ్మో... బాబో... నాయనో... సచ్చాన్రోయ్' అన్న కేకలు ఆగి కూడా చాలా సేపయ్యింది. పులి వాత పడ్డ జంతువులా వుండి ఉండి సన్నగా మూలుగుతున్నాడు. వాడి ఒంటి మీద కట్టె పేడుతో సుబ్బమ్మగారు కొట్టిన దెబ్బలు బక్క చిక్కిన నల్లని వాడి వంటి మీద ఎర్రగా ఉబ్బి తేలాయి. కట్టె పేళ్ళు చీరుకు పోయిన చోట రక్తం ఎర్రగా చిమ్మి ధారలుగా జారుతూంది.

నేల మీద బోల్తా పడిపోయిన వాడిచుట్టూ ఇంగువ పోపులో ఘుమ ఘుమలాడే పులిహార, నేతి ముద్దతో నిండిన చక్కెర పొంగలి విరజిమ్ముకుపోయాయి.

అమ్మవారికి పర్వదినాన అపచారం జరిగిందన్న ఆగ్రహమేగాని 'అయ్యో' అన్న మనిషి లేడు.

అందరి కళ్ళు నిప్పులు రాలుస్తున్నాయి ఆరేళ్ళ ఈరిగాడి మీద. ఎవరికి వారు నోటికి వచ్చినట్లు శాపనార్థాలు పెడుతున్నారు.

"అమ్మా! కాళికాదేవి తల్లి, క్షమించు తల్లి." అని లెంపలు వాయించుకుంటున్నారు.



... Seeta Rama Sastry
WRITER APSEB JEO (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.

కాని మానవ సేవే మాధవ సేవ - అన్నార్తుడికి ఇంత ముద్ద పెట్టి ఆకలి తీర్చటమే భగవంతునికి నివేదనంత గొప్పది, అందుకే బిక్ష వేసేటప్పుడు 'శివార్పణం, కృష్ణార్పణ.'' అని వేస్తారు, అదీగాక పసి పిల్లలు దేవునితో సమానం, వాళ్ళకి మంచి చెడు తెలియదు అన్న కనీస ఆలోచన ఆ చుట్టూ మూగిన వేద వేదాంగాలు పఠించి వల్లె వేసే శ్రోత్రియులెవ్వరికి రాకపోవటం, శంకరాచార్య అంతటి వాడు ఒక అస్పృశ్యుని ముందు మోకరిల్లిన వైనం గర్తుకు రాకపోవటం శోచనీయం.

ఒక అనాథ పసివాడ్ని కట్టెలతో చచ్చేదాకా బాది, తనకి భోగం చేస్తే లోకాలనేలే తల్లి జగన్మాత సంతోష పడుతుందా?

అటువంటి భక్తులకి అమ్మదయ లభిస్తుందా?

ఆ ఆలోచన రాదేం వారికి? ❖